క్లుప్తంగా

రేపు చెవిరెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కొమరోలు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 29వ తేదీన ఒంగోలు పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గిద్దలూరు వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు తెలిపారు. మండలంలోని తాటిచెర్లమోటు మీదుగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి గిద్దలూరు వస్తున్న సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'అన్నా'ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి



గోగులదిన్నెలో మాట్లాడుతున్న జంకె

మార్కాపురం రూరల్: వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోగులదిన్నె గ్రామంలో కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మాజీ ఎంపీపీ ఎల్.మాలకొండయ్య, సీహెచ్ రమణారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: స్థానిక అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాధానమ్మ బుధవారం పట్టణంలోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



మార్కాపురంటౌన్: శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. జీర్ణావస్థకు చేరిన ధ్వజ స్తంభం స్థానంలో వేదమంత్రాల మధ్య నూతన ధ్వజ స్తంభాన్ని ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చకుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఆలయ రాజగోపురాల నిర్మాణంలో భాగంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. చైర్మన్ కేశవరావు, ఆలయ ధర్మకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

దర్శి: ఎన్నికలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్‌ఓ లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని గంగపాలెం రూట్‌లో పలు పోలింగ్ కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. లోకేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో గతంలో ఏ విధంగా పోలింగ్ జరిగింది అన్న కోణంలో ఆరా తీస్తున్నామన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఏవైనా సలహాలు సందేహాలు ఉంటే సంప్రదించాలని కోరారు. తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

గాయపడిన చుక్కల దుప్పికి చికిత్స

గిద్దలూరు రూరల్: దిగువమెట్ట రైల్వేస్టేషన్ సమీపంలో చుక్కల దుప్పి గాయపడి స్థానికులకు కనిపించిన సంఘటన బుధవారం జరిగింది. సమాచారం అందుకున్న డిప్యూటీ రేంజి ఆఫీసర్ వంశీకృష్ణ తన సిబ్బంది సాయంతో గాయపడిన దుప్పిని పట్టుకుని వైద్య సాయం అందించారు. దుప్పిని సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి వదిలేశారు. అరుదుగా కనిపించే ఇటువంటి చుక్కల దుప్పిని సంరక్షించేందుకు అటవీశాఖ సిబ్బంది ఎంతో శ్రమించారని డీఆర్‌ఓ తెలిపారు.

వైఎస్సార్ సీపీకి మాజీ సైనికుల మద్దతు



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో మాజీ సైనికులు

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీకి గిద్దలూరు నియోజకవర్గంలోని మాజీ సైనికుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మాజీ సైనికుల సంఘ నాయకుడు గురుప్రసాద్ యాదవ్ బుధవారం గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని పట్టణంలోని ఆయన ఇంట్లో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నిస్తామన్నారు. గిద్దలూరు ప్రాంతంలో ఎక్కువ మంది మాజీ సైనికులు ఉండటంతో వారికి అందుబాటులో ఉండేందుకు వారానికి ఒకసారి జిల్లా కేంద్రం అధికారులు స్థానికంగా ఉండే ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలోని కాశినాయన కుంట ఆవరణలో అమరవీరుల స్థూపం ఏర్పాటు వంటి అంశాల గురించి ఎమ్మెల్యేతో చర్చించారు. మాజీ సైనికుల సంఘ నాయకులు కెప్టెన్ శ్రీనివాసరెడ్డి, కాశయ్య పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



రాజుపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కృష్ణచైతన్య

పొదిలి రూరల్: రాష్ట్రంలో పేదలంతా ఆత్మాభిమానంతో గౌరవంగా జీవించేలా సంక్షేమ పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అన్నా కృష్ణ చైతన్య కోరారు. బుధవారం పొదిలి నగరపంచాయతీ 5వ వార్డులలోని రాజుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ప్రచారానికి వచ్చిన కృష్ణ చైతన్యకు స్థానికులు రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు, డేగ వెంకటరావు, టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. మూడు పార్టీల కూటమిని నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, ఎస్‌కె నూర్జహాన్‌బేగం, గౌసియాబేగం, రబ్బానీ, తాతా సత్యం, కొగర వెంకటరావు, జాకీర్, ఫిరోజ్, సింగారెడ్డి వెంకటేశ్వర్లు, చిన్న నారాయణరెడ్డి, దాసు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

'అన్నా'ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు మురారి

తర్లుపాడు: వైఎస్సార్ సీపీ మార్కాపురం అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులను మండల పార్టీ అధ్యక్షులు మురారి కోరారు. బుధవారం మండలంలోని రాగసముద్రం ఎస్సీ కాలనీలో పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అన్నీ వేళలా అండగా ఉండి సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే అన్నా ముందుంటారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందాయన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణారెడ్డి, వైస్ సర్పంచ్ శాంతారావు, వైస్ ఎంపీపీ సుజాత తిరుపాల్, తాడివారిపల్లి సర్పంచ్ జాన్‌రత్నం, పార్టీ మండల నాయకులు ఎబినేజర్, కొండారెడ్డి, భూపాల్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరెడ్డికి బూచేపల్లి పరామర్శ



వెంకటేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి

ముండ్లమూరు: ముండ్లమూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ముండ్లమూరు సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డిని దర్శి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి బుధవారం పరామర్శించారు. వెంకటేశ్వరరెడ్డి ఇటీవల ప్రమాదంలో గాయపడగా శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి గ్రామానికి చేరుకొని అంబటి వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు యరబ్రోలు వీనివాసరెడ్డి, అంబటి తురుపతిరెడ్డి, అంజిరెడ్డి, కుమ్మిత నారాయణరెడ్డి ఉన్నారు.

నేడు 'అన్నా' ఎన్నికల ప్రచారం

కొనకనమిట్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో రోజు గురువారం వైఎస్సార్ సీపీ మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు మండంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు గనివానిపాడు బ్రహ్మంగారి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గనివానిపాడు, వాగుమడుగు, రేగడపల్లి, అంబాపురం, బురదపాలెం, చింతగుంట, కొనకనమిట్ల, పుట్లూరివారిపల్లి, వెలిగండ్ల, మునగపాడు, బసాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే అన్నా ప్రజలను కలిసి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి గుంటూరులోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. కొమరోలు మండలం అలసందలపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి(41) గిద్దలూరు శివారులోని ఒంగోలు రోడ్డులో చిరువ్యాపారం నిర్వహిస్తుంటాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి దుకాణం మూసివేసిన తర్వాత స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న సమయంలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను బంధువులు గుంటూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రామకృష్ణారెడ్డి మృతి చెందడంతో ఆ దిశగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెంచు గిరిజనులకు ఓటు హక్కుపై అవగాహన

పెద్దదోర్నాల: మండల పరిధిలోని మర్రిపాలెం గిరిజన గూడెంలో ఓటు హక్కుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్టు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో డీటీడబ్ల్యూఓ జగన్నాథరావు పాల్గొని గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన వారికి ఓటును వేసుకోవచ్చన్నారు. ఐటీడీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజయ్, స్వీప్ జిల్లా లేబర్ ఆఫీసర్ భూపాల్, నోడల్ అధికారి శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ కొండలరావు, ఆర్వోఎఫ్ఆర్ కో ఆర్డినేటర్ భూమని మంతయ్య, పంచాయతీ కార్యదర్శి అర్జున్‌సింగ్ పాల్గొన్నారు.

తాటిపర్తి ప్రచారం నేడు

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలో గురువారం ప్రచారం ప్రారంభించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి తెలిపారు. మండలంలోని సోమేపల్లి, మిరియంపల్లి, గాంధీనగర్‌లో సాయంత్రం నాలుగు గంటలకు ప్రచార కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కన్వీనర్లు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు పాల్గొనాలని ఆయన కోరారు.

మృతులకు తాటిపర్తి నివాళి



కోటిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ వివిధ ప్రాంతాల్లో గుండెపోటుతో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లి నివాళులర్పించారు. బుధవారం యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడు గ్రామానికి చెందిన చిట్యాల కోటిరెడ్డి, పుల్లలచెరువు మండలం గంగవరం గ్రామానికి చెందిన 2వ వార్డు సభ్యుడు ఆవుల సుబ్బయ్య గుండెపోటుతో మృతి చెందారు. మృతదేహాలకు ఆయన పూలమాలవేసి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, వాగ్యా నాయక్, ఆయా ప్రాంతాల నాయకులు ఉన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు ఎమ్మెల్యే అన్నా దిశానిర్దేశం



ఎమ్మెల్యే అన్నాను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

మార్కాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్లందరూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు దిశానిర్దేశం చేశారు. బుధవారం మార్కాపురంలోని ఎమ్మెల్యే అన్నా నివాసంలో కౌన్సిలర్లు కరీముల్లా, ఉత్తమ్‌కుమార్, ముస్లిం మైనార్టీ జాయింట్ సెక్రటరీ ఖాశీం తదితరులు కలిసి పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి, ఫ్యాను గుర్తుపై ఓటు వేసేలా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను కౌన్సిలర్లు సన్మానించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్ప విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు శివాలయం ప్రాంగణంలో శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి భక్తిశ్రద్ధలతో ప్రజలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఎంవీ రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో విశేష అభిషేకాలు, సాయంత్రం ధాన్య, పుష్ప, వస్త్ర, శయ్య, దర్పణ, ఛత్ర, చామర, నీరాజన, మంత్రపుష్ప తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం ట్రాక్టర్‌పై విగ్రహాలు ఉంచి మేళతాళాలతో, భక్తిపాటలు పాడుకుంటూ ఊరేగించారు. పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ మంత్రవాది వీరవెంకట సత్యనారాయణశర్మ పర్యవేక్షణలో గురువారం ఉదయం 9.38 గంటలకు అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

మార్కాపురం: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి సూచించారు. బుధవారం పట్టణంలోని ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించి సిబ్బందికి, డాక్టర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లెలో గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆ సమయంలో నాగార్జునరెడ్డి సమక్షంలో బురుజుపల్లె గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు, అర్ధవీడు మండలం చీమలేటిపల్లె కాశిరెడ్డి ఆధ్వర్యంలో 30 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీకి విధేయులుగా ఉంటూ పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. జగనన్న పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, మాజీ సర్పంచి కలువ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ వరిగడ్డి దగ్ధం



మంటల్లో కాలుతున్న వరిగడ్డి

రాచర్ల: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ట్రాక్టర్ వరిగడ్డి పూర్తిగా కాలిపోయిన సంఘటన మండలంలోని జేపీ చెరువులో బుధవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. జేపీ చెరువు గ్రామానికి చెందిన షేక్ మౌలాలీ అనే వ్యక్తి తన పశువులకు మేత కోసం గిద్దలూరులో ట్రాక్టర్ వరిగడ్డి కొనుగోలు చేసుకుని జేపీ చెరువు గ్రామానికి వెళ్తున్నాడు. ఆ సమయంలో రెండు విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని అగ్గిరవ్వలు వరిగడ్డిపై పడ్డాయి. ట్రాక్టర్‌లోని వరిగడ్డి కాలుతున్న సమయంలో డ్రైవర్ వెంటనే గమనించి వరిగడ్డిని కిందపడేశాడు. వెంటనే అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించారు. మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.